శారదలేఖలు

సౌభాగ్యవతియగు కల్పలతకు :—

నెచ్చెలీ!

నీవువ్రాసిన జాబుచేరినది. నేనుగూడ నీవలెనే స్త్రీ నాటకరంగప్రవేశమును గూర్చియే అహర్నిశలు యోచింపుచున్నాను. "అయినను ఈనాటకసమస్య మనకు గానిపని. ఆడువారమా, పాడువారమా, యంటివేల? స్త్రీయుద్యమమనిన తరువాత అది స్త్రీజాతి కంతయు సంబంధించినదే. ఏలయన నేడు యీయుద్యమము వలన కలుగబోయెడి లాభనష్టములు, మానావమానములు, కీర్త్యపకీర్తులు, స్త్రీజాతికంతయు జెందును. ఏనాడో కైకచేసిన యకార్యమును, చిత్రాంగిచేసిన దుష్కృత్యమును కారణముగా "అబ్బా! ఆడవాళ్లెంత గట్టివాళ్లు. ఎంతకైనా సాహసులే" అనువాదు స్త్రీజాతి కంతయు చుట్టుకొనినది!

మ॥ నరకద్వారము సాహసాకరము పుణ్యస్వర్గవిఘ్నంబు దు
స్తరమాయాశతపేటి దంభనిధిదోషస్థాన మప్రత్యయో
త్కరసుక్షేత్రము కాలకూట మమృతాకారంబు స్త్రీయంత్రముం
ధరనెవ్వాఁడు సృజించె బూరుషగళోద్బంధక్రియాపాశముం.

అని భర్తృహరి స్త్రీని హృదయభేదకముగా దూషించినాఁడు. భక్తిజ్ఞాన వైరాగ్య విషయములలో కృషిచేయువారు స్త్రీని యెంత పేలవముగా నిరసింపవలెనో అంతనిరసింపుచుందురు. దేవవేశ్యలైననేమి; మర్త్యవేశ్యలైననేమి; వేశ్యజాతి మూలకముగా స్త్రీసంఘమునకు చెందిన యపఖ్యాతి అపారముఁ కాని యీజాతిని సృష్టించినవారును పురుషులే, దూషింపుచున్నవారును పురుషులే. కాన వీని నన్నింటిని బాగుగా గుర్తించి నూతనోద్యమమునకు చేయూత నిచ్చుటో నిరసించుటో యనెడు బాధ్యత ప్రతిస్త్రీపైనున్నది. ఇది మనదిగాదని యూరుకొనుట మనజాతి సౌభాగ్యమును నష్టపఱచుకొనుట. మఱియు దీనివలన గలిగెడు మంచిచెడ్డలు స్త్రీలవేగాబట్టి పురుషులకంటె స్త్రీలే ఈ విషయమును పూర్ణముగా విచారించి కర్తవ్యమును నిర్ణయించుకొనవలసినవారైయున్నారు.

రసపోషణకే, భావపుష్టికే, కళాభివృద్ధికే, స్త్రీ నాటకరంగములో ప్రవేశించిన తరువాత మోటారుబస్సులయందును, రైలుబండ్లయందును, ఒదిగి కూర్చున్నట్లును, విధిలేక తలవంచుకొని ఆపత్కాలమందు డాక్టరుగారికి చేయిచూపించినట్లును, చిన్ననాడు తప్పని సరిగా బడిలో పంతులుగారివద్ద చదువుకొనినట్లును, సభామధ్యమున తనకిష్టమైన విషయమునుగూర్చి ఒడలు వణుకుచునో మాటలు తడబడుచునో నాల్గుముక్కలు చెప్పినట్లును, నాటకరంగములో చరించుటకు వీలులేదు. లజ్జావతియగు స్త్రీ నాటకరంగ మధ్యమున పరపురుషుడని యాంగికాభినయమున నాతనితో సమముగ జరించుటకే కొంచెము వెనుదీసినను నాటకకళ అధ్వానమైపోవును. హంగుచెఱచిన యెడల స్త్రీ రంగమున కెక్కి ప్రయోజనమేమి? నవరసముల పోషించి హావభావప్రకటనము నందు లోటు లేకుండ ప్రదర్శించి నాటకములలో స్త్రీప్రవేశింప కుంఠటవలన గలిగెడు గొప్పలోటును తొలగించి నాటకకళను మహోన్నతస్థితికి దెచ్చుటకేగదా, స్త్రీ నటకురాలు కావలసి వచ్చినది? కాన స్త్రీ రంగమున కెక్కిన తరువాత మడిలేని పిన్న పెద్దలు సంచరించెడిచోట మడిగట్టుగొనిన ముసలమ్మ యొదిగి యొదిగి నడచినట్లు యెడ యెడగా నుండుటకు వలను పడదు. కలిసి చరించుట స్త్రీల కర్హ్యముగాదు. అయినను నాటకకళాభివృద్ధికొఱకు స్త్రీల నేల బలవంతముగా నాకర్షింపవలెనో నాకు తోచకున్నది. రాముడుగాని తా నచ్చముగ రాముడుగను, సీతగాని తా నచ్చముగ సీతగను, నటించి వేషధారి ప్రేక్షకుల నానందింపజేయుటయే నాటకము. తాము సీతారాములముగామని నటకులకు దెలియును, ప్రేక్షకులకును దెలియును. అట్టిచో సీతవేషమును స్త్రీవేసినను నొకటే. పురుషుడు వేసినను నొకటే. పురుషుడు స్త్రీగా నటించిన నందు కొంత సామర్థ్యప్రకటన ముండునేమోగాని స్త్రీనటించినచో నందద్భుతమేముండును? స్త్రీయైన మాత్రమున పలుభావములు ప్రకటించుటలో కౌశలము వలదా? యనిన నదియు నిజమేకాని పురుషుడే యిన్నిభావములు ప్రదర్శించిన మఱియు నధికకుశలతయనిపించు కొనును గదా! శీలము మనుష్యునిబట్టి యుండునుగాని వృత్తినిబట్టియుండదని కొందఱనుచున్నారు. కాని సీతవంటి శీలవతి నాటకరంగములో సీతవేషముధరించు ననుకొనుము. ఆదర్శపాత్రమగు సీతశీలమును ప్రతిస్త్రీయును తనజీవితమునందనుష్ఠేయముగా నుంచుకొనదగినదికదా. హనుమంతుడు సీతను తన మూపున నిడుకొని శ్రీరామచంద్రుని కడకు గొంపోవుదునని సీతతోఁజెప్పినప్పుడు పరపురుషునంటనని సీతచెప్పినది. ఉత్తమమైన యాసతీధర్మము ననుష్ఠించెడు యాసీతవేషధారిణి నాటకరంగములో నెట్లు చరించును? నాకు దుర్జ్ఞేయముగానున్నది. అదిసరే. భాగవతములు నాటకములు

మున్నగు నీకాలక్షేపము లెందులకుఁ బుట్టినవి? ఇంచుక యోచింతము. ప్రజలలో నీతిని ఇంపొందించుటకును, దేశానురక్తిని గలిగించుటకును మతాసక్తిని బుట్టించుటకును దైవభక్తిని వ్యాపింపఁ జేయుటకును, జనులను కూటమిగాఁ జేర్చి కాలక్షేపములు జరుపుట మన దేశములో ననాదిగా నడచుచున్న యాచారము. ఇవి సామాన్యముగా పామర జనుల ప్రబోధము కొఱకే యేర్పడినవి. వీనిలో మొదటి మెట్టు కథలు చెప్పుకొనుట. కథ నీతికరమైనదియు కథకులు వచోనైపుణిగలవారును నైనచో ఆటపాటలు, మద్దెల తాళములు, బహుపాత్రలు లేకపోయినను, వినువారి మనస్సు నట్టె యాకర్షించి చిత్రప్రతిమలుగాఁ జేయవచ్చును. వీనిలో శ్రోతలు కథలోని పాత్రలను మానసికముగా సృష్టించుకొందురు. వీనిలోనున్న యేకాగ్రత మేళతాళాడంబరములలో నుండెడి కాలక్షేపములలో నుండదు. తల్లివద్ద నేకాగ్రచిత్తముతో నిట్టి కథల నాలకించియే మహారాష్ట్రచక్రవర్తియైన శివాజీ యంతటి శూరుడైనాఁడు. వీనికి కొంచెము పైమెట్టు గొల్ల సుద్దులు, తందాన పదములు మున్నగునవి. వీనిని వినువారు ముఖ్యముగా జానపదులు. ఈ పదములు వట్టి పాడిమాటలు కాకపోయినను తత్తుల్యములగు కొంచెము రాగముతోఁగూడిన పదములు. వీనికి కొంచెమూఁత ఏకతంత్రీసాధనమగు తంబూరయు కొమ్ము, తిత్తి, మున్నగునవి. పూర్వము జనసామాన్యములో మతము, యుద్ధము, మున్నగు వానినిగూర్చి ప్రబోధము కలిగించ వలసినప్పుడు పరవశచిత్తులగు వారిచే నుద్రేకముగా చదువబడెడి యీ పదములు బహూపయోగకరముగ నుండెడివి. ఇప్పటికిని బొబ్బిలికథ, పల్నాటివీరచరిత్రము, మున్నగు వీరచరితములు పాడబడునపుడు జానపదులలో గల్గెడి యుత్సాహ మద్భుతము. వీనికి పైమెట్టు తోలుబొమ్మలాటలు. జనులలో నాగరికత యభివృద్ధియైన కొలది యీకాలక్షేపముల యభివృద్ధియు పలుతెఱగులుగా నుండజొచ్చినది. ఉపనిషత్కాలమున మానసికముగానున్న యేకేశ్వరోపాసన కాలక్రమమున ఆడంబరములతోఁగూడిన ప్రతిమార్చనగా మాఱి మనుజుని పతనమునకు కారణమైనట్లు ఈకాలక్షేపముల వృద్ధియు మన పతనమునకే దారిచూపినవి. కథలను గేయములను వినునప్పుడాయాకథలలోని యుత్తమపాత్రలకు మానసికముగా రూపకల్పన కావించుకొని వాని సత్యశీలసామర్థ్యములను గుర్తించి వానిని తమ జీవితములందనుష్ఠేయముగా నుంచుకొనుటకు శ్రోతలకవకాశముండెడిది. కాని తోలుబొమ్మలాటలలో ప్రసిద్ధవ్యక్తులకు కృత్రిమరూపములు కల్పించుటచే చిత్తైకాగ్రత నశించినది. తోలుబొమ్మలాటలతోనే రంగస్థలమున తెఱయెత్తబడినది. వాయిద్యపరికరములుగూడ నధికమైనవి

గాత్ర మాధుర్యమునకు ప్రాముఖ్యత ఈయ బడినది. కాన కథలకు కళాసాంకర్యము గల్గినది ఈతోలుబొమ్మలాటలయందేనని చెప్పవచ్చును. కాని మన భరతఖండమునందలి ప్రసిద్ధేతిహాసములగు రామాయణభారతాది యుద్ధగ్రంథములయందలి శూరభక్తానీకముల చరిత్రములను బొమ్మలద్వారాసుబోధముగావించి పామరజనులలో నీతి ప్రబోధము గావించుటయే యీతోలుబొమ్మలాటల లక్ష్యముగూడ నైయుండెను. కాని యచేతనములగు తోలుబొమ్మల నాడించి సచేతనపుతోలుబొమ్మలగు జనసామాన్యము నానందింప జేయుటయనునది కాలక్రమమున నాగరికులకు మోటుగా తోచినది. కాన తామే ఆయాపాత్రముల ధరించి నటించుట యుక్తముగా భావించినారు. అవియే భాగవతములు. తోలుబొమ్మలాటవఱకు మనుజుడు మొగమునకు రంగుపూసికొని రంగమున కెక్కలేదు. మఱియు తోలుబొమ్మలాటవఱకు నీకథల నడుపువారు సామాన్యముగా శూద్రులే యైయుండిరి. ప్రాయికముగా వీరి గురువులు బ్రాహ్మణులై యుండినను నలువురిలో నాడెడివారు మాత్రము బ్రాహ్మణేతరులే. బ్రాహ్మణేతరులలో నిట్టియాటపాటల కాలక్షేపములు జరుగుచుండ బ్రాహ్మణు లూరకొనలేదు. పురాణపఠనము హరికథలు మున్నగునవి వారి కాలక్షేపములుగా నుండెడివి. అయితే వారి కాలక్షేపములకు వీరును వీరికాలక్షేపములకు వారును పోకుండిరని భావనకాదు. వాని ఆధిపత్యము లాయాజాతుల వారు మాత్రమే చేయుచుండిరని యర్థము. అయితే భాగవతములలో అన్ని జాతులవారును పాల్గొనిరి. బ్రాహ్మణభాగవతులు—వీరే కూచిపూడి భాగవతులు. గొల్లభాగవతులు, ఏనాదిభాగవతులు, మాలభాగవతులను పేరులతో వేర్వేఱు కులములవారు భాగవతముల నాడుచుండుట యిప్పటికిని కందుము. నాట్యకళాబ్రహ్మయగు భరతాచార్యునకు పూజ్యత ఈ భాగవతములయందే కల్గినది. మఱియు హావభావముల కాధిక్యతయు, శృంగారమునకు ప్రాముఖ్యతయు, కృష్ణచారిత్రమునకు ప్రాధాన్యతయు, నీతికి న్యూనతయు నీభాగవతముల కాలముననే గల్గెను. కాని యొకమేలు వీధిభాగవతముల వఱకు వీనివ్యయము జనసామాన్యమునకు తగిలెడిదికాదు. గ్రామములో పెద్దలైనవారేనలుగురైదుగురో దాని వ్యయమును భరించి ప్రజాసామాన్యమున కాయాటను సందర్శించు భాగ్యమును ధారాగతము చేసెడివారు. వాని తరువాతనే నాటకములు. ఈనాటకములలో గూడ వీధినాటకములని యొక్కటే తెఱతో వీధులలో నాడునవి కలవుకాని ప్రచారము స్వల్పము. ఇప్పటి నాటకములనగా వానికొక ప్రత్యేక మందిరముండును. రంగానుకూలములైన పరికరము లధికము. వేషభూషాడంబర మెక్కువ. నృత్యగీతాభినయములకు ప్రాముఖ్యత

యధికము. మఱియు ప్రతిచూపరియు కొంతమూల్యమును తన స్థితినిబట్టి యిచ్చుకొన
వలయుట వీనిలో ముఖ్యవిషయము. టిక్కెట్లపద్ధతితో గూడిన నాటకములు ధనికులను
పేదలను విడదీసినవి. కాన భాగవతములు నాటకములు మున్నగు కాలక్షేపములు జరుపుట
ప్రజాప్రబోధమునకనెడి యాదర్శమును నాటకములు చెఱచినవి. నాటకములు శ్రీమంతు
లగు నాగరికుల కానందమును గూర్పవచ్చును, కాని ప్రజాసామాన్యమునకు వీని ప్రయో
జనములేదు. ఒకవేళ యే పాటకపు జనుఁడైనను పావలా, అర్ధా, చెల్లించి నాటకమునకు
వెళ్లియుండినచో త్రాగుబోతైన వాఁడు యింటిలోని భార్య, బిడ్డలగోడు జూడక కల్లంగడికి
వెళ్లినట్లే నాటకముల చూడవచ్చిన కూలివాడుకూడ యింటిలో మఱుపూట గంజి
కాధారములేకుండజేసి నాటకసందర్శనమనెడి దుర్వ్యసనపిపాస దీర్చుకొనుటకు వచ్చి
యుండెననుట స్పష్టము. కాన ధనికులగు విద్యాధికులకే నాటకములు. వీరి యానంద
మునకు పురుష వేషధారులు చాలలేదు. కాన స్త్రీలనుగూడ రమ్మనుచున్నారు.

ఇటీవల కొంతకాలమునుండియు నాటకకళ విషయమై మనయాంధ్రదేశమునందు
ప్రచారము జరుగుచున్నది. సమర్థులైన నటకులు కొందఱు బయలుదేరి బహుమాన
ములు, బిరుదులు, పొందుచున్నారు. ఈ కళాభివృద్ధికై గ్రంథములు కొన్ని ప్రకటింపఁ
బడినవి. పత్రికలుగూడ స్థాపింపఁబడినట్లు జ్ఞాపకము. కాని ఈ ప్రచారమంతయు పురు
షులలోనే జరుగుచున్నది. స్త్రీలుగూడ నాటకరంగములో పాల్గొనకుండుట లోపమను
సంగతిని కళావిదులు నిన్నమొన్నటివఱకు గుర్తింపలేదు. బహుశఃయిది ఈవత్సరమే
దేశములో ప్రవేశించిన నవ్యమారుతము. ఇది పశ్చిమవాయువని కొందరన; కాదు,
కాదిది ప్రాచ్యమారుతమే యని కొందఱనుచున్నారు. ఇది యేగాలియైననేమి మన
హిందూస్త్రీ మనస్తత్వముల కిదిసరిపడునా? లేదా ? యనునదియే యోచింపవలసిన
యంశము. వేశ్యజాతి స్వర్గలోకములోనున్నది. మర్త్యలోకములో నున్నది. పాతాళ
లోకములోనున్నది. చతుర్యుగములకు సంబంధించిన శ్రుతిస్మృతిపురాణేతిహాసములలో
వీరి ప్రస్తావన గలదు. కాన యిది అతిపురాతనమైన తూర్పు వాయువు అని చెప్పుటకు
సందేహము లేదు. ఆయిన నేమి? నీతిభ్రష్టమైన యీజాతి ధర్మమును కూకటివేళ్లతో
గూడ పెల్లగించుటకు దేశహితైకాభిలాషులెల్లరు తీవ్రముగా యత్నింపుచున్నారుగదా.
అట్లే ఈ నాటకరంగ ప్రవేశోద్యమముగూడ పాచ్యమైననేమి, ప్రతీచ్యమైననేమి, ప్రాక్తన
మైననేమి; అధునాతనమైననేమి; సతీశ్రేయమునకు భంగకరమైనచో నది నిర్మూలింపఁ
జేయుట స్త్రీలకర్తవ్యము. మనయింటిదీపమని ముద్దుపెట్టుకొనఁదగునా?

కల్పలతా.

"లోకోభిన్నరుచి"యన్నట్లు జనులతలపులు బహువిధములు. నీతి లక్ష్యము కొందరికి, కళాప్రియత్వము కొందఱికి, కనులపండువు కొందఱికి, ఎవరి యుద్దేశము కాదనినను వారి కావేశమే యెత్తుకొనివచ్చును, కాని ఆలోచింపవలసిన విషయముల కావేశముచెందితే లాభములేదు. కాన ఒకప్పుడు శీలమునకై యాత్మార్పణము గావించి యశోవిశాలమైన భారతమహిళ నేడు నాటకకళకు బలియై తన పూర్వౌన్నత్యమును చెఱుచు కొనుట యుత్కృష్టమో, నాటకకళకులోపము కల్గినగల్గుగాక తన శీలమునే ప్రాధాన్యముగా బెట్టు కొని నాటకరంగములకు వెలిగానుండుట యుత్కృష్టమో, స్త్రీలును స్త్రీసంఘాభ్యుదయ పరులగు పురుషవరేణ్యులును యోచింతురు గాక.

దూఱుదూఱుమను వారేగాని తోడు దూఱువారుండరు. స్త్రీలిందు పాల్గొనుట వలన దేశమభివృద్ధి జెందుననియు, నాట్యకళ పెంపొందుననియు, స్త్రీపురుషులు యోగ్యులైయున్నచో వారెంత కలిసి మెలసి యున్నను ప్రమాదములేదనియు, కళాభిమానులగు వారు తమ యుద్యమ విస్తారమునకై పలుతెఱగుల సమాధానములుచెప్పి స్త్రీలనాకర్షింప వచ్చును. కాని నాటకములాడు స్త్రీలనుగాంచి లఘుభావమున పలుగాకిమూకలాడు ప్రల్లదముల నాప వీరితరమా?

మహాత్మునివంటి యుత్తమోత్తమ పురుషవరేణ్యునిచే నడుపబడుచున్న సబర్మతీ సత్యాగ్రహాశ్రమమును బోలు నిష్ఠురనియమవిధానముగల సంస్థయందే స్త్రీపురుషులలో లోపములు గననయ్యెనని మహాత్ముడు వలవల విలపించినాడు. శీలభంగభయముచేతనే స్త్రీపురుషులుకలిసి పనిచేసెడు ఫ్యాక్టొరీవిధానమును మహాత్ముని వంటి ప్రాజ్ఞులు నిరసింపు చున్నారు. అట్టిచోనిక నాటకరంగములా స్త్రీలమర్యాదను చెక్కు చెదరకుండ రక్షింపునవి?

పూర్వము మనదేశమున స్త్రీలు నాటకములలో పాల్గొనినట్లు కానము. ఉండిరని చూపఁబడుచున్న వారు దేవవేశ్యలైన అప్సరసలేగాని సంసారిణులుగారు. మన శాస్త్ర మహోదధియందు బాల్యవివాహ వాదులకును ప్రౌఢవివాహవాదులకును నుదాహరణ ములుగా జూపదగిన శ్లోకరత్నములు లభించినట్లే ఒకవేళ వెదకినచో నీ విషయమునగూడ యుభయవాదులకును నుదాహరణ శ్లోకరత్నములు కొదువలేక దొరకవచ్చును. వేష ధారణము గృహస్థ నిషిద్ధకర్మమని శాస్త్రదృష్టాంతములు పెక్కులుగలవు. వాని నెల్ల

7

నిక్కడ వాకొనుట అనవసరము. ముంజేతి కంకణమునకద్ద మెందులకు? స్త్రీనాటకరంగ ప్రవేశముయొక్క ఫలితములు సాధారణ విషయములను బట్టియే కరతలామలక మగు చుండ ప్రాచీనోదాహరణముల కొఱకు ప్రాకులాడుటేల? కల్పలతా! నాటకకళనుగూర్చి సందర్భమునుబట్టి యింతగా విమర్శించుటచే నాటకకళయనిన నాకు ద్వేషమని భావింప కుము. స్త్రీల ప్రవేశమునుగూర్చియే నాకభిప్రాయభేదముగాని కళాకోవిదులగు పురుష వరేణ్యులీనాట్యకళోద్ధరణకై విశేషము పాటుబడి మన యాంధ్రదేశమును నీ విషయ మునగూడ తీసిపోని దానినిగాఁ జేసిరేని నాకు పరమసంతోషము. కాని యే స్త్రీజనా భ్యుదయచింత స్త్రీజనప్రయోజనకరములగు నుదారసంస్కరణములకు నన్ను సుముఖు రాలనుగాఁ జేయుచున్నదో ఆమహనీయ చింతయే నన్నీయుద్యమమునకు వ్యతిరేకాభి ప్రాయనుగా చేయుచున్నది. దీర్ఘముగా నాలోచించిన పిదపనే నే నీనిశ్చయమునకు వచ్చి తిని. అది నాకళాయనభిజ్ఞతయు ఛాందసమునునని యేరైన నధిక్షేపించినను నదియు నాకొక యలంకారమే యనుకొందును. శారద.

చందమామ

శ్రీమతి లలితకుమారి

చందమామా రావె జాబిల్లి రావె
వెండిరథమ్ము పై వేవేగ రావె
చిగురాకు మోవి పై చిరునవ్వు సుధలు
తొలిచూపు తీవలో వలపుల పూలు

పాలబుగ్గల మీద మంచుచన్నీరు
పొలుపొంద ప్రకృతియే పులకించిపోవ
చందమామా రావె జాబిల్లి రావె
ప్రాచ్యసౌధద్వార బంధమ్ము చెంత

చెంగావిరంగుల చేలమ్ము దాల్చి
మందమారుత గీతమాధురుల్ చిలికి
యెవ్వరో హారతి నిచ్చుచున్నారు
భూమియే పాటగా పులకించిపోవ
చందమామా రావె జాబిల్లి రావె.